# కనిపించని కన్నీరు

"ఇదుగో వింటున్నావా? పాయసం, గారెలూ చెయ్యి సాయం కాలానికి. ఏడూ ఏడున్నరకల్లా వస్తాం."

"మీదంతా విపరీతం. ఏదనుకుంటే అదే."

"అదంతా నీకెందుకు? కాస్త నే చెప్పిన మాట వినరాదూ? ఆర్నెల్లనుంచీ తోముతుంటే ఇప్పటికి కాస్త మెత్తబడ్డాడు. ఇవాళ వస్తానన్నాడు శాస్త్రి మనింటికి. ఇవాళ చిన్న ఫేర్‌వెల్ పార్టీ ఉంది కాలేజీలో. అటునుంచి ఇటే వచ్చేస్తాం" అంటూ బ్రీఫ్ తీసుకుని బయట పడ్డాడు గోపాలరావు.

కాలేజీ అంతా కోలాహలంగా ఉంది. సీతారామశాస్త్రి కాలేజీ నుంచి వెళ్ళిపోవడం కుర్రవాళ్ళకు ఇష్టంలేదు. అతడు పాఠాలు బాగా చెబుతాడు. కుర్రవాళ్ళను పల్లెత్తు మాట కూడా అనడు. వాళ్ళు అల్లరి చేసినా కోపించుకోడు. పాఠం గురించి తప్ప మరే విషయమూ మాట్లాడడు. అతడి ముభావం కాలేజీలో కుర్రాళ్ళకే కాక ఉపాధ్యాయులకూ ఆశ్చర్యమే అనిపించేది. పట్టుమని పది నెలలు కాలేదు. కాలేజీ వదలిపెట్టి వెళుతున్నాడు. స్టాఫ్ మెంబర్స్‌తో అతడేనాడూ చనువుగా ఉండలేదు. అతడీ ఉద్యోగం ఎందుకు వదలివెళుతున్నాడో, ఎక్కడకు వెళుతున్నాడో కూడా ఎవరికీ తెలీదు.

చిలకసముద్రం పెద్ద ఊరు కాదు. ఒకప్పుడు వెనకబడిన ప్రాంతమే. ఒరిస్సాలో లోపలకు పోనుపోను ఇంకా చాలా ప్రాంతాలు వెనకబడే ఉన్నాయి. డిగ్రీ కాలేజీ కూడా ఇటీవలే వచ్చింది. కొత్తగా వచ్చిన కెమిస్ట్రీ లెక్చరర్ పేరు వినగానే గోపాలరావు చాలా సంతో

షించాడు. తెలుగువాడని తెలిసిపోతూనే వుంది పేరునుబట్టే. తెలుగు వాళ్ళకోసం మొహం వాచిపోయినట్లైంది. రాజ్యం కూడా ఎంతో సంతోషిస్తుంది.

ఆరోజున ప్రిన్సిపాల్ స్టాఫ్‌రూమ్‌కి వచ్చి సీతారామశాస్త్రిని స్టాఫ్‌కి పరిచయం చేశాడు. ఆంధ్రా యూనివర్శిటీ గోల్డుమెడలిస్ట్ అని చెప్పాడు. స్టాఫ్ అందరికీ ఆశ్చర్యమైంది. శాస్త్రివైపు ఎగాదిగా చూశారు. మంచి ఖరీదైన అందమైన సూటులో ఉన్నాడు శాస్త్రి. పచ్చని పసిమి. అందమైన కళ్ళజోడు లోంచి కళ్ళలో ఏదో కాంతి కనబడుతోంది. నిగనిగలాడే వొత్తైన జుట్టుతో చక్కటి పాపిట. ఇతడు ఇలాటి చిన్నచోట కాలేజీ ఉద్యోగానికి రావడమేమిటా అని చాలామంది విస్తుపోయారు.

మొదటిరోజే శాస్త్రిని తమ ఇంటికి తీసుకొనివెళ్ళాలని గోపాలరావు వాళ్ళ డిపార్ట్‌మెంటుకు వెళ్ళాడు. అతడు లేబొరేటరీలో ఉన్నాడంటే అక్కడకు వెళ్ళాడు. శాస్త్రి నిర్వికారంగా కుర్చీలో కూచుని ఉన్నాడు. గోపాలరావుని చూసి ఏమీ ఆనందం కనపరచలేదు. స్నేహపూర్వకంగా ఆహ్వానించనూ లేదు. పలకరించనూ లేదు. ఏ కుర్రాడి కోసమో ఆయన వచ్చి ఉంటాడనుకున్నట్లుగా కదలకుండా మెదలకుండా ఉండిపోయాడు. కాని, గోపాలరావు వదలిపెట్టలేదు.

"నేనిక్కడ మేథమెటిక్స్ లెక్చరర్‌నండీ!" అని తనని గూర్చి వివరంగా చెప్పుకున్నాడు. "మీరు నాతో ఇప్పుడు మా ఇంటికి రావాలి" అని అనునయంగా కోరాడు. కాని, శాస్త్రి ఏమాత్రం జాగా ఇవ్వలేదు. అసలు అతడితో ఆచి తూచి ఒక్కమాటకన్నా ఎక్కువ మాట్లాడనే లేదు.

అలా మొదటి ప్రయత్నం భగ్నమైంది.

ఏదో ప్రసక్తి వచ్చినప్పుడు రాజ్యంతో శాస్త్రి వింత ప్రవర్తన ఒకటి రెండుసార్లు చెపితే, 'ఉండండి. వాళ్ళావిడ వచ్చింతర్వాత ఆ రహస్యమేమిటో నేను కూపీ లాగుతాను' అని ఆసక్తిగా అభయమిచ్చింది.

ఈ మాటన్న రెణ్ణెల్లకు "అబ్బే, అదీ లాభంలేదోయ్! శాస్త్రికి పెళ్ళయిందీ కానిదీ కూడా ఎవరూ చెప్పలేకపోతున్నారు" అన్నాడు గోపాలరావు. ఈసారి రాజ్యం చాలా ఆశ్చర్యపడింది. "మాటల్లో పెట్టి కనుక్కోలేకపోయారా?" అంది.

"మాటల్లో పెట్టడానికి మాట్లాడితే కదా!" అని జాలిగా ముఖం పెట్టాడు గోపాలరావు.

ఆర్నెల్లు గడచిన తర్వాత కాస్త దారిలో పడ్డాడనిపించింది. ఎవరైనా ఏదైనా అడిగితే ఒకటి రెండు మాటలు మాట్లాడడం, ఎప్పుడైనా నవ్వడం, పలకరింపుగా చూడడం చూసి 'అమ్మ- ఫరవాలేదు' అనుకున్నారు స్టాఫ్ మెంబర్లు. అప్పుడిక మళ్ళీ ప్రయత్నించాడు గోపాలరావు, శాస్త్రిని ఎలాగైనా ఒకసారి ఇంటికి తీసుకొనివెళ్ళాలని. కాని, అది మాత్రం సాధ్యపడింది కాదు.

ఇవాళ శాస్త్రి తమ ఇంటికి రావడానికి ఒప్పుకోవడం ముందు నమ్మలేకపోయాడు గోపాలరావు. రెండు రోజుల్లో ఎలాగూ ఇక్కడ నుంచి వెళ్ళిపోతున్నాను కదా అని మెత్తబడ్డాడేమో శాస్త్రి అనుకున్నాడు. ఏది ఏమైనా గోపాలరావుకు చాలా సంతోషంగా, సంతృప్తిగా ఉంది- శాస్త్రి తమ ఇంటికి రాత్రి భోజనానికి రావడానికి అంగీకరించడం.

సాయంకాలం కాలేజీలో వీడ్కోలు సమావేశం తర్వాత సీతారామశాస్త్రిని వెంటబెట్టుకుని ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు తన కోరిక తీరిందన్న సంబరంతో ఇంట్లోకి అడుగుపెట్టాడు గోపాలరావు.

గేటు దాటి పదడుగులు నడిచి మెట్లు ఎక్కి వరండాలో అడుగు పెడుతున్నాడో లేదో ఎక్కడ నక్కి వుందో, ఎంతసేపటి నుంచి ఎదురుచూస్తున్నదో గునగున పరుగు నడకతో వచ్చి కాళ్ళు చుట్టేసుకుంది మణి. నాన్న నాన్న అని మురిపెంగా ముద్దులు కుడుస్తోంది.

'ఓసి బంగారుకొండ! ఎటునుంచి వచ్చావే' అని గోపాలరావు మురిసిపోతూ బిడ్డను ఎత్తుకున్నాడు.

రాజ్యం వచ్చి మణిని తన చేతుల్లోకి తీసుకోబోతుంటే రానని గునిసింది. గారాం చేసింది. 'చూడు, అంకుల్ ఏమనుకుంటాడు? మంచ మ్మాయి కాదు మణి అనుకోడా? నాన్నారిని బట్టలైనా మార్చుకోనివ్వవా? నా బంగారు తల్లికదూ!' అని బుజ్జగించి చిట్టిని చంకలో సర్దుకుని గోపాలరావు చేతిలోని సంచిని తీసుకుంది రాజ్యం.

'రండి, రండి' అని శాస్త్రిని ఆప్యాయంగా పలకరించింది. డ్రాయింగ్‌రూంలో ఇలా వాళ్ళు కూచుంటూ ఉండగానే కాఫీ తీసుకొని వచ్చింది రాజ్యం. చిట్టిపొట్టి అడుగులతో తల్లి వెనకాలే వచ్చి 'నాన్నకు నేను ఇవ్వాలి కప్పు' అని పేచీ పెడుతున్నది మణి. 'నీచేత కాదే తల్లీ, చేయి కాలుతుందే బుజ్జీ, చూడు అంకుల్ ఏమనుకుంటారు? మణి ఒట్టి గయ్యాళి పిల్ల అనుకోరా?' అని బుజ్జగిస్తోంది తల్లి.

'ఇలా రా పాపా!' అని పిలిచాడు శాస్త్రి. కొత్త చేయకుండా బుద్ధిమంతురాలిలాగా అతడి దగ్గరకు వెళ్ళింది మణి. ఎత్తుకొని వొళ్ళో కూచోపెట్టుకున్నాడు.

పదినిముషాల్లో వస్తానని గోపాలరావు లేచాడు.

గోపాలరావు వచ్చి చూసేసరికి శాస్త్రితో ఏమిటో కబుర్లాడు తోంది మణి. మమేకమే అయిపోయింది. జేబులో చెయ్యిపెట్టి ఏదో శోధిస్తున్నది. 'తప్పుకదూ మణీ!' అని గోపాలరావు ముక్కుమీద వేలేసు

కుంటే ఫక్కుమని నవ్వింది. 'మాకు బాగా దోస్తీ కలిసిపోయిందిలెండి. ఎన్ని కబుర్లు చెప్పిందో' అని బుగ్గలు పుణికి గట్టిగా హత్తుకొని ముద్దెట్టుకున్నాడు శాస్త్రి.

తండ్రి వచ్చి కుర్చీలో కూచోగానే శాస్త్రినుంచి బలవంతాన విడిపించుకుంది. 'వద్దమ్మా! ప్లీజ్, నా దగ్గరే కూచో. నేను బొమ్మలు చూపిస్తాను. రేపు వచ్చేటప్పుడు నీకు చాక్‌లెట్లు, బోల్డు బొమ్మల పుస్తకాలు తెస్తా'నని ప్రాధేయపడుతున్న శాస్త్రినుంచి గింజుకొని తండ్రి దగ్గరకు చేరింది. కాళ్ళమీదగా చుట్టుకొని వొళ్ళోకి పాకింది. "ఈ వయసున మా అమ్మాయేనండి మాకు కాలక్షేపం. ఇది వాళ్ళమ్మను విడిచిపెట్టైనా ఉంటుంది కాని, నన్ను విడిచి క్షణమైనా ఉండదు. నన్ను కాలేజీకి వెళ్ళవద్దంటుంది. కాలేజీనుంచి ఇంటికి రావడం కాస్త ఆలస్యమైందో- ఆరోజు బిక్కమొహంతో ఎదురుచూస్తూ కూచుంటుంది. దీనికి మొన్ననే ఆరో ఏడు వచ్చింది. ఆరోజు మీరు రాలేకపోయారు. నన్ను క్షణం విడిచిపెట్టదండీ మా అమ్మణ్ణి. వొట్టి దొంగకన్నవాడు వీడు. అబ్బో చాలా పాటలు పాడుతుంది. ఏమిరా బంగారూ, మామకి నీ పాట వినిపించావా?" అని తండ్రి అడుగుతూ ఉంటే గారాబంగా తల అడ్డంగా ఊపుతూంది. 'నీకు నెమలి పాట వచ్చు కదమ్మా - నాకు నేర్పవా?' అని గడ్డంతో చుబుకం కింద రుద్దుతుంటే కిలకిలా నవ్వుతోంది.

'లేస్తారా వడ్డిస్తాను' అంటూ వచ్చిన రాజ్యం 'ఇహ ఆ కూతురు వొళ్ళోవుంటే ఈయనకు అన్నం నీళ్ళు కూడా అక్కరలేదు' అంటూ మురిపెంగా కూతురుని తన దగ్గరకు తీసుకోబోయింది. మణి తండ్రిని వదిలిపెట్టలేదు. 'అన్నం తిందువుగాని రావా?' అంటే అటునుంచి ఇటు మెడంతా అడ్డంగా తిప్పింది. 'మా బంగారు తల్లికదూ, నీకు మంచి కథ చెపుతాను. బువ్వ తిని బజ్జోవాలి కదా! నువు తినేసి పడుకుంటే

మామయ్యకీ నాన్నకీ వడ్డిస్తాను' అని ఎంత బుజ్జగింపుగా చెప్పినా మణి వినలేదు. 'నేను నాన్న దగ్గరే తింటాను' అని గారాలు రాగాలు తీసింది.

భోజనాలు చేస్తుండగా చనువు తీసుకొని ఎన్నెన్నో అడిగింది రాజ్యం అయినా శాస్త్రినుంచి తనకు కావలసిన సమాచారం రాబట్టలేక పోయింది. తమ విషయాలన్నీ చెప్పి ఆ వరసన అతడి గురించి ఎన్నో ప్రశ్నలు వేసింది. తనకు ఒక అక్క వుందనీ, అమ్మ వుందనీ, అమ్మ అక్కదగ్గరే ఉంటున్నదనీ చెప్పాడు శాస్త్రి. తన సంసారం గురించి అడగ్గా 'చల్లటి పూట ఇప్పుడా సంగతి ఎందుకులెండి' అని మాత్రం బయటపడ్డాడు.

భోజనాలైన తర్వాత అంతా వరండాలో కూచున్నారు. తాంబూలం వేసుకోనన్నాడు శాస్త్రి. రాజ్యం ఈనెలు తీసి ఇస్తుండగా గోపాలరావు తాంబూలం చిలకలు అందుకుంటున్నాడు. మణి అప్పటికి నిద్రపోలేదు. తనకూ ఆకూ వక్కా కావాలని మారాం చేస్తున్నది తండ్రి వొళ్లో కూచుని.

అప్పటికి బాగా వెన్నెల వచ్చేసింది. దూరంగా కాలేజీకి వెళ్ళే రోడ్డు కన్పిస్తున్నది. పక్కవాళ్ల ఆవరణలో పెద్ద పున్నాగ చెట్టు ఉంది. ఆ ఏటి తొలికారు పూత సాంద్రంగా వాసనలు ఎగజిమ్ముతోంది. దూరంగా ఓ కుక్కపిల్ల కీచుమని అరుస్తోంది.

''ఇది మమ్మల్ని ఏమార్చి దొంగలాగా పుట్టిందండీ! మాకన్న తల్లి పుట్టకపోతే బీదులాగా ఉండేది మా బతుకు చూడండి శాస్త్రీ, రిటైరయ్యే వయసుకు పదేళ్ల పిల్లలుంటే అదొక అందం. అదొక ఆశ'' అన్నాడు గోపాలరావు.

''ఆ- సరేలెండి. మీకేం చెపుతారు. అరవై ఏళ్లొచ్చేసరికి పదేళ్ల పిల్లలో, పన్నెండేళ్లవాళ్లో ఉంటే వాళ్ళ చదువులేం కావాలి, వాళ్ళు ఎప్పటికి పెద్దవాళ్లు కావాలి? నా పినతల్లి కొడుకులు నలుగురూ అర్జనా

పరులే. పెద్దపెద్ద ఉద్యోగస్థులే. ముప్పై ఏళ్లొచ్చినా చెల్లెలికి పెళ్ళి చేయలేకపోయారు. ఆ బెంగతోనే మా బాబాయి కాస్తా వెళ్ళిపోయాడు" అని కళ్లొత్తుకుంది రాజ్యం.

"పనీపాటలూ అన్నీ వచ్చు. ఎమ్.ఏ. పాసై ఉద్యోగం కూడా చేస్తోంది. మీకు ఇంకా పెళ్ళి కాలేదంటే నా మనసు ఆశపడింది కూడానూ. చెప్పొద్దూ. ఈయన్ను కనుక్కోమని ఎన్నోసార్లు చెప్పాను" అని చనువుగా రహస్యం చెప్పింది రాజ్యం.

'ఇందుకా వీళ్లకు తనమీద ఇంత శ్రద్ధ!' అనుకున్నాడు శాస్త్రి. అప్పటికి రెండుసార్లు ఇక వెళతానండి అని లేవబోయాడు కాని దంపతులు వెళ్లనివ్వలేదు.

"ఓసారి ఇలా ఇవ్వండి పాపను. ఇక నేను వెళతాను."

"ఈ రోజుకిక్కడే పడుకుందురు గాని. పొద్దున్నే కాఫీ తీసుకొని వెళ్లవచ్చు. మొగం వాచిపోయాం. ఎన్నాళ్ళైందో మాకు మూడో మనిషి కన్పించి! మణీ, అంకుల్ ఉండిపోతాడు కదూ? ఉండమని చెప్పు" అంటుంటే తల్లివైపు మొగం విప్పార్చి చూస్తూ బుంగమూతి పెట్టి శాస్త్రి దగ్గరకు వచ్చింది మణి.

హఠాత్తుగా దృశ్యం మారిపోయింది.

పాపను వొళ్లో కూచోబెట్టుకున్న శాస్త్రి, ఆ బుజ్జిని పొట్టకు గట్టిగా హత్తుకుంటున్నాడు. ఇక తమాయించుకోలేకపోతున్నాడు. స్పష్టాస్పష్టంగా ఏడుపును దిగమింగాలని అతడి ప్రయత్నం. వరండాలో పడుతున్న వెన్నెల వెలుతుర్లో అతడు కుర్చీలో కిందుమీదవుతున్నాడు. లైటుడోములోంచి కాంతి అతడి ముఖంమీద పడకపోయినా కళ్ళనుంచి దుఃఖం పెల్లుబుకుతున్న సంగతి తెలుస్తూనే ఉంది.

'ఏమిటైంది, ఏమిటైంది, ఏమిటైంది' అని కంగారు పడ్డారు దంపతులు.

ఏమీలేదు అని చెపుతున్నా శాస్త్రి గొంతు జీరగుండి పోవడం వాళ్ళు గమనించారు. పిల్లను తన దగ్గరకు తీసుకోబోయింది రాజ్యం.

కాని అతడు వదిలిపెట్టలేదు. ఈ హఠాత్పరిణామానికి పాపకు ఏడుపొస్తున్నది. బిక్క మొగంపెట్టి రాగం తీసేందుకు సిద్ధంగా ఉంది. గోపాలరావు అతడి దగ్గరగా వచ్చి బిడ్డను తీసుకోబోయాడు. కాని శాస్త్రి పాపను తన కోటులో దాచుకున్నంత గట్టిగా చేతులతో ఆవరణ కల్పిస్తున్నాడు. 'ప్లీజ్, కాసేపు నాదగ్గర ఇలా ఉండనివ్వండి. ఇప్పుడే ఇచ్చేస్తాను' అంటుంటే అతడి కంఠం రుద్ధమైపోతున్నది. ఎన్నాళ్ళకో ఎంత బలవంతం చేస్తే కాని ఇంటికి రాని ఈ అతిథి అనూహ్యమైన ప్రవర్తనను అర్థం చేసుకోలేక వాళ్ళు వెలతెల బోతున్నారు. శాస్త్రి కంఠంలో ఏడుపు గుడుసుళ్ళు పోతున్న వైనం తెలుస్తూనే ఉంది. పాప భయపడుతుందేమోనని దిగులు దిగులుగా చూస్తున్నారు అతడివైపు. అతడి దగ్గరనుంచి తప్పించుకొని తల్లిదగ్గరకో, తండ్రి దగ్గరకో రావాలని పాప తన శక్తినంతా కూడగట్టుకుంటున్నకొద్దీ నీళ్ళలో మునిగి పోతున్నవాడికి కాలికేదో గట్టు తగిలినట్లో, చేతికేదో ఆధారం దొరికినట్లో పాపను గట్టిగా గుండెలకు హత్తుకుంటున్నాడు శాస్త్రి.

"క్షమించాలి. మీ మనసుకేదో నొప్పి కలిగినట్లున్నది. మానిన గాయమేదో సెలవేసినట్లున్నది. బలవంతాన ఇంటికి తీసికొని వచ్చి మీ మనసుకి కష్టం కలిగించినందుకు చాలా బాధపడుతున్నాము" అన్నాడు గోపాలరావు.

"కాదు కాదు. మీరే నన్ను క్షమించాలి. ఇవాళ నేను చాలా వింతగా ప్రవర్తించాను. మనసులో గూడు కట్టుకున్న ఉద్రేకాలను అదుపులో ఉంచుకోలేకపోయాను. ఇదివరకటి ప్రతిసారిలాగే ఇవాళ కూడా తప్పించుకుని ఉంటే బావుండేది. లేదా గంటకు ముందే సెలవు తీసుకొని వెళిపోయి ఉన్నా బావుండేది. ఎన్నడూ నేను వద్దనుకున్న

ఘటనలమధ్య ఇరుక్కుని పోతూనే ఉన్నాను. కొన్ని బలహీనతలు, ఆ తర్వాత నిస్సహాయంగా అందులో ఇరుక్కుని పోవడమూ పదే పదే జరుగుతున్నది."

వాళ్ళు మౌనంగా ఉండిపోయారు. శాస్త్రి గుండెలమీద తల ఆన్చి విశ్రాంతిగా పాప నిద్రపోతున్నది. చుబుకం కింద తన కుడి చేతిని ఆన్చి, పాప పొట్టమీద తన ఎడంచేయి ఆప్యాయంగా ఉంచి శాస్త్రి క్రమంగా తెప్పరిల్లసాగాడు.

"మాది బందరు దగ్గర మల్లవోలు. చిన్నప్పుడే మా నాన్నగారు పోయారు. జిల్లా కోర్టులో ఆయన ఏదో చిన్న ఉద్యోగం చేసేవారు. నాకన్నా ఐదేళ్ళు పెద్ద అక్క ఉంది. మేమిద్దరమే. మాకు ఒకరికి ఒకరం. గుంటూరులో మా మేనమామ ప్లీడరు. మా అక్క పెళ్ళి ఆయనే చేశారు. మా అమ్మ చాలా అభిమానస్తురాలు. అమాయకురాలు. నాకప్పటికి పదేళ్ళు. స్కూల్లో ఫస్ట్ ఫారం చదువుతున్నాను.

మా మామయ్య మా అక్కకు తెచ్చిన సంబంధం మా అమ్మకు అంతగా ఇష్టంలేదు. కాని ఎట్లా చెప్పగలదు? వేరే దిక్కు ఏముంది? మాబావ వాళ్ళు చాలా బీదవాళ్లు. అక్కడ దిక్కూమొక్కూ లేదు. స్కూల్లో ఏదో అటెండరు ఉద్యోగం చేస్తూ ప్రైవేటుగా పరీక్షల కేవో చదువుకుంటున్నాడతడు. మా ఊళ్లో చిన్న పెంకుటిల్లు, ఒంటిమీద కాస్త బంగారం అమ్మేసైనా కాస్త చదువుకున్న కుర్రాడికి ఇవ్వాలనీ అమ్మ ఆశ. బి.ఏ.అయినా కాకపోతే ఎట్లా అంటుండేది తరచు అమ్మ. కాని తాను ఆశ్రితురాలు. నాకు స్కూల్లో ప్రతి తరగతిలోనూ మంచి మార్కులే వస్తుండేవి. నాకు మేనమామ కూతుర్ని ఇస్తాడనీ, ఇవ్వడని చుట్టాలు చెవులు కొరుక్కుంటూ ఉండేవారు. ఆటలు పట్టిస్తూ ఉండే వారు. అమ్మ అభిమానాన్ని గాయపరుస్తూ ఉండేవారు. నాకైతే లోపల చాలా ఉక్రోషంగా ఉండేది. ఈయనకంటే చాల డబ్బు కలవాడు,

హోదా కలవాడు; వరలక్ష్మికంటే బాగా అందమైందీ, బాగా చదువు కున్నదీ, ఇంకా ఆమాటకొస్తే ఉద్యోగం కూడా చేసేది, మేమిద్దరం ఉద్యోగం చేస్తూ మాంచి కారు కొనుక్కొని మా అమ్మ నందులో గర్వంగా కూచోబెట్టుకుని, నా పెళ్ళాంతో మా మామయ్య వాళ్ళింటికి రావాలనీ, వాళ్ళు మెప్పుగా వాళ్లింట్లో ఉండమన్నా ఉండకూడదనీ కలలు కంటూ ఉండేవాణ్ణి.

అక్క పెళ్ళి కాగానే మేము మా మామయ్య వాళ్ళింట్లో ఇమడ లేకపోయాము. అక్కా బావలు ఎప్పుడైనా వచ్చిపోతూ ఉండాలి కదా! వాళ్ళింట్లో మర్యాద జరగలేదని మాబావ పెళ్ళిలోనే విసుక్కున్నాడు. పేచీలు పెట్టాడు. చుట్టపక్కాలు అనవలసిన మాటలు అన్నారు.

మేము తెనాలి వెళ్ళిపోయాం. పూర్ణానందంగారని ఒక పెద్ద ప్లీడరు. వాళ్ళింట్లో మా అమ్మ వంటచేసేది. ఆయన నా కాలేజీ ఫీజులూ అవీ సర్దుతుండేవారు. ఇలాగా ఓ పది సంవత్సరాలు నామీది ఆశతో మా అమ్మ నానా బాధలు పడింది. మేము చుట్టాల ఇండ్లకు ఎప్పుడూ వెళ్ళేవాళ్లం కాము. పల్లెటూళ్లో ఉండే ఇల్లు ఎవరు చూస్తారని దాన్ని అమ్మేసింది అమ్మ. నేను బి.ఎస్సి. ఫస్ట్‌క్లాసులో రాష్ట్రం మొత్తం మీద మూడోరాంకులో ప్యాసైనాను. ఎమ్.ఎస్సి. చదవడానికి ఆంధ్రా యూని వర్శిటీకి వెళ్ళి సులభంగానే సీటు సంపాదించాను. పూర్ణానందంగారి కుడు అక్కడ ప్రొఫెసరుగా ఉండేవారు. నాక్కావాల్సిన చిన్న సహా యియ్యంయాలు, మంచి చెడ్డలు ఆయన చూసేవారు. ఆయనకు తన కూతురిని నాకిద్దామని కూడా ఉండేది. కాని ఆ పిల్ల మా అమ్మను ప్రేమాభిమానాలతో చూడదని నాకెందుకో అనుమానం.అందువల్ల నేను ముందే జాగ్రత్తగా మసలుకొన్నాను.

నాకు ఎలాగూ యూనివర్శిటీ ఫస్టు వస్తుందని తెలుసు. రిసెర్చికి కూడా వెంటనే అవకాశం దొరుకుతుందనీ తెలుసు. కాని, ఎన్నాళ్ళిలా?

ఇంకో రెండేళ్లో మూడేళ్లో అమ్మను కష్టపెట్టడం ఇష్టం లేకపోయింది. నన్నాదరించిన ప్రొఫెసరుగారికి నాపట్ల అసంతృప్తిగానూ ఉంది. అందులో ఆయన తప్పూలేదు.

సరదాగా ఏమవుతుందో చూదామని బ్యాంకు పరీక్షలు రాశాను. అందులో ఆఫీసరుగా సెలక్షన్ వచ్చింది. మొదటి పోస్టింగ్ కోజికోడ్. ముందు బొంబాయిలో కొన్నాళ్ళు ట్రెయినింగ్ అయినాను. నాకప్పుడు ఇరవై ఆరేళ్ళు. పెద్ద జీతం. సమాజంలో ఆకర్షణీయమైన హోదా. స్నేహితులు, అధికారులు, నాపట్ల ఇష్టం ఉన్నవాళ్లూ ఎన్నెన్నో సలహాలిచ్చారు. ఇంకా పెద్ద పరీక్షలు రాయమన్నారు. రిసెర్చి చేస్తే సుఖకరమైన, పేరు ప్రతిష్ఠలార్జించగల, ఎటువంటి వొడిదుడుకులు లేని భవిష్యత్తు ఉందన్నారు. కాని, వచ్చిన అవకాశం వదులుకోవడం నాకిష్టం లేక పోయింది. తిరువాన్కూరు బ్యాంక్‌కు ముందు ముందు ఎంతో అభివృద్ధి ఉంది. చాలా పైస్థాయికి నేనెదగవచ్చు. తర్వాత రెండేళ్లలో చాలా బాధ్యతగల పై పదవిలో కాలికట్‌కు మార్చారు. అమ్మ నాతోనే ఉంది. ఆమెకు ఈ జీవితానికల్లా ఒకే ఒక కోరిక. ఆ కోరికే తీరితే జీవితం ధన్యమైనట్లే. ఎన్ని కష్టాలు, దుఃఖాలు ఇదివరలో అనుభవించినా ఈ కోరిక తీరితే బతుకంతా సార్థకమైనట్లే. అదే నా పెళ్ళి. తర్వాత మనవడినో మనవరాలినో లాలించడం. శేషజీవితానికి అంతకన్న ధన్యత లేదు. కాని అక్కడే ఆమె ఘోరంగా వంచనకు గురి అయింది.

తంగం చాలా అందమైన కనుముక్కు, పలువరస, తలకట్టు తీరు, మంచిగంధం తేనె కలగలుపు వొంటిరంగు-అంత అందమైన పిల్లను నేనిదివరకెన్నడూ చూడలేదు అనుకొనేవాణ్ణి. చాలా చలాకీతనం. ఆ చురుకుదనం, తెలివితేటలు చెప్పలేము. ఆఫీసు పని అంతా చకాచకా ఎంతో నీటుగా పూర్తిచేసేది. చాలా ధనవంతుల బిడ్డ. వాళ్ళ

నాన్నగారు పెద్ద ప్రభుత్వ వ్యాపారస్థుడు. నా దగ్గరే పనిచేసేది తంగం. ఒకసారి త్రివేంద్రంలో పెద్ద కాన్ఫరెన్సు జరిగింది. నాతో పాటే వచ్చింది తంగం. కాలికట్టులో నేను వాళ్ళింటికి కూడా తరచు వెళుతూ ఉండేవాణ్ణి. ఈ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటే ఏం అని నా మనసు విపరీతమైన కోరికలు పెంచుకోసాగింది. ఇక అప్పుడు ఈ జీవితంలో నా అంత అదృష్టవంతుడెవరైనా ఉంటారా? ఉండరు గాక ఉండరు. నాకు నా ప్రాంతంలో ఇక మిగిలి ఉన్న బంధా లేమున్నాయి గనుక? నేనీ ప్రాంతంవాణ్ణే అయిపోతాను. నా పిల్లల భవిష్యత్తా.... ఇంత తెలివికల, ఆత్మవిశ్వాసం కల, చురుకైన, అంద మైన, బాగా డబ్బూ పలుకుబడీ ఉన్న తండ్రిగల నా తంగం తన పిల్లల భవిష్యత్తు తీర్చిదిద్దుకోలేదా! సహజంగా అమ్మకు ఇష్టం ఉండదు. కానీ, ఈ అవకాశం వదులుకుంటే నేను నా జీవితాంతం పశ్చాత్తాప పడాల్సివస్తుంది. తంగం కళ్ళు పిచ్చెక్కిస్తాయి. అంత పొడుగు జడ నేనెక్కడా చూడలేదు. నవ్వుతూ గోముగా, ఒయ్యారంగా నా ముందు సార్‌సార్ అంటూ వినయంగానే నాచుట్టూ వలతాళ్ళు బిగిస్తున్నట్లుండేది.

ఎంత అదృష్టమైన ఘడియ అనుకున్నానో అదే అంత దుర దృష్టకరమైన ముహూర్తమనీ, నా పాలిట గొప్ప శాపమనీ నేను అనుకోలేకపోయాను. కాన్ఫరెన్స్ అయిపోయిన తర్వాత చుట్టుపక్కల చూడాల్సిన ప్రదేశాలు చూదామని ఓరోజు బయలుదేరాం. దగ్గరలో బీచి, మ్యూజియం, జూ అన్నీ చూసి ఆ సాయంకాలం ఓ సినిమాకు కూడా వెళ్ళాం. గుడ్‌నైట్ సార్ అని తన గదిలోకి వెళ్ళబోతున్న తంగంను తనివిదీరా కౌగలించుకుంటే, మర్యాదగా గోముగా ముసిముసి నవ్వులతో అనౌచిత్యాన్ని తెలియజేసిందే కాని అసమ్మతి చూపలేదు.

అమ్మకు చెప్పాను. ఆ అమ్మాయి లేకపోతే బతకలేను అన్నాను. అమ్మకు నామీద పంచప్రాణాలు. నేను తప్ప తనకింక ఎవరున్నారు?

భాష, కులం, బంధువులు అన్నీ తైపారు వేసుకుంది. తన భయాలు, ఆందోళనలు, కోరికలు, ఆశలు, దైన్యం, అనుమానం అన్నీ విడమరచి చెప్పింది. "ఏం ఫరవాలేదమ్మా, అన్నిటికీ నేనున్నాను కదా!"

'తండ్రీ! నీ సంతోషం కంటే నాకు మోక్షం కూడా అక్కర్లేదు. దేవుడు ప్రత్యక్షమై నీకేం కావాలి అని అడిగినా నా కన్నతండ్రి సంతోషమే నాక్కావాలి అని చెపుతాను. అయితే, ఒక సంగతి ఆలోచించు. నా జీవితంలో ముప్పైయో ఏట నుంచీ అన్నీ కష్టాలే, అవమానాలే, బాధలే. ఇప్పుడా వయసుకి చాలామందికి పెళ్ళి కూడా కావడంలేదు. కాని, నాకన్నీ అప్పటికే పూర్తి అయినాయి. మీ ఇద్దరు పిల్లలను చూసుకొని బతికాను.'

'నీకేం ఫరవాలేదమ్మా, నేనున్నాను కదా! అనుక్షణం నిన్ను చూసుకుంటాను. నీ ప్రేమవల్ల, మంచితనంవల్ల తంగం నీకెటువంటి కష్టం కలిగించకుండా చూస్తాను' అని ఎన్నెన్నో వాగ్దానాలు చేశాను.

మా పెళ్ళి జరిగిపోయింది. అమ్మకు అనుమానాలు లేని, అపోహలులేని శుభప్రారంభం కూడాను.'గురువాయూరు దేవాలయంలో నైతేనే చేస్తాను ఈ పెండ్లి. లేకపోతే ఎక్కడికైనా వెళ్ళి మీరే రిజిస్టరు మారేజి చేసుకుని రాండి' అన్నాడు వాళ్ళ నాన్న. తంగానికి ముగ్గురన్నలు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. వాళ్ళ బంధువుల కెవరికీ ఇష్టం లేదు. కులం గురించికాదు- డబ్బా, తన బంధుబలగంలో తానాశించే హోదా లేకపోవడం ఆయనకు అసంతృప్తి కలిగించేది. అయితే, ఆ కుటుంబంలో అందరు పిల్లలూ స్వేచ్ఛగా పెరిగారు. తమ ఇష్టాలూ, తమ నిర్ణయాలూ తమవే. ఇతరుల కందులో ప్రమేయం ఉండకూడదు. ఉండనక్కరలేదు. పదహారో శతాబ్దంలో తాము బతకడం లేదు అనే వాళ్ళు వాళ్ళు. గుళ్ళో పెళ్ళి తంగానికి ఇష్టంలేదు. అయితే, తండ్రి

ప్రాపకం పోగొట్టుకోవడం అంతకంటే ఇష్టంలేదు. నాకు పెళ్ళి ఎక్కడ జరిగినా ఒకటే. తంగం కావాలి. అంతే. అదే ముఖ్యం. అమ్మ మాత్రం చాలా సంతోషించింది. కుంజన్ నంబియారుగారు గొప్ప దైవభక్తులు కాబోలు, మడీ, ఆచారం, నిష్ఠ వాళ్ళింట్లో తప్పవు కాబోలు అని వెర్రి బాగుల్దానిలా మురిసిపోయింది.

కాని తంగం తనను తన్ని తగిలేయడానికి వెనుకాడదని ఆరు నెలల్లోనే తెలుసుకుంది. ఓ ఏడాది దాకా సంధి కుదుర్చుకున్న పక్షాలు లాగా సజావుగానే సాగిపోయింది. ఆ ఇంట్లో అమ్మ ఒంటరిది. వంట చేసి పెట్టడానికి, పనిమనిషి చాకిరికి మాత్రమే ఆమె మనుగడ. 'మనం వేరే వంటమనిషిని పెట్టుకుందాం, ఇద్దరం ఉద్యోగాలు చేయాలి కాబట్టి, అదీకాక, మీ వంటలూ అవీ అమ్మకు తెలీవుకూడాను' అని నచ్చచెప్ప బోతే, 'ఆవిడ ఇక్కడ ఉండి ఏం చేస్తుంది కనక, తెలీకపోతే తెలుసు కోవాలి, నేర్చుకోవాలి' అనేది తంగం. ఆమె వేషభాషలు తంగానికి నచ్చేవికావు. తన భర్తను కన్న తల్లి అన్న విచక్షణకూడా లేదు. ప్రేమాభిమానాలు లేకపోయినా ఆమెను గాయపరచేటట్లు కేకలువేసేది.

అయినా, అమ్మ అవన్నీ నాకోసం వోర్చుకుంది. అయితే, నేను వోర్చుకోలేని పరిస్థితులు ఎదురుకావడం మొదలైంది. తంగానికి తీవ్ర వాద రాజకీయాల సానుభూతి ఉన్న విషయం నాకు పెళ్ళికి ముందు తెలిసే అవకాశం లేదు. వాళ్ళ అన్న ఇంజనీరింగు చదువుతూ ఇంట్లోంచి వెళ్ళిపోయి రాజకీయాలలో చురుకుగా ఉంటున్న సంగతి కూడా నాకప్పట్లో తెలీదు. ఆ తర్వాత అతడు మా ఇంటికి మూడు నాలుగు సార్లు వచ్చాడు. రాత్రి ఉండి పొద్దుటే వెళ్ళిపోయేవాడు. ఆ తర్వాత క్రమంగా ఇద్దరు ముగ్గురు స్నేహితులతో కూడా కలిసివస్తూ ఉండే వాడు. వాళ్ళు రాత్రుళ్ళు చర్చించుకుంటూ ఉండేవాళ్ళు. ఒకటి రెండు సార్లు తంగంకూడా వెళ్ళి వాళ్ళతో చర్చలు చేసేది. నేను సహించలేక

కోప్పడ్డాను. రెండు మూడుసార్లు మౌనంగా ఉన్నది కాని, తర్వాత నన్ను నాగరకత, అభ్యుదయ భావాలు లేనివాణ్ణిగా తిరస్కరించింది. వాళ్ళ అన్న నన్ను చూసి ఓ మూర్ఖుడిలా జమకట్టి వ్యంగ్యంగా నవ్వుతూ ఉండేవాడు.

నా ఉద్యోగం ఊడుతుందని ప్రాధేయపడితే నన్నొట్టి చవట దద్దమ్మగా తేల్చిపారేశారు అన్నాచెల్లెళ్ళు. క్రమంగా నా మనసునిండా అశాంతి, ఆశాభంగం, అసంతృప్తి, మా అమ్మపట్ల చాలా అపరాధ భావం చుట్టుముట్టేవి. అయితే, మా స్వర్ణ పుట్టింది. మా అమ్మ అవ మానాలు, దుఃఖాలు, బాధలు అన్నీ మరచిపోయింది. ఉఫ్‌మని ఊదే సింది. మెటర్నటీ హోంనుంచి ఇంటికి వచ్చినప్పటినుంచీ స్వర్ణతోడిదే ఆమె లోకం. తంగంకు ఇదెంతో అవసరం కూడాను. తన సమస్త అశాంతి దిగమింగింది అమ్మ. తంగం చూపే నిరాదరణ, నిర్లక్ష్యం ఆమెకిప్పుడు ఒక లెక్కలోవి కావు.

ఆమెకూడా అప్పుడప్పుడేవో మీటింగులకు పోవడం, రాత్రుళ్ళు ఆలస్యంగా ఇంటికి రావడం, ఇదెక్కడి పీడరా బాబూ అనిపించేది నాకు. బతిమాలాను. బామాలాను. కాని, భంగపడ్డాను. 'మిస్టర్ శాస్త్రీ, నేను నీకు పిల్లల్ని కని ఇవ్వడానికి నిర్దేశితమైన యంత్రాన్ని కాను. నాకూ దేశం, సమాజం, మనోవికాసం, చూసుకోవాల్సిన బాధ్యత లున్నాయి. ఇష్టమైతే సరేసరి. లేకపోతే విడిపోదాం' అనేది. 'నూరేళ్ళ కిందటి ఆడదాని బానిసత్వం ఇప్పుడూ చెల్లుబాటు కావాలని నీవు కోరుకొంటావు కాబోలు. ఇంకానా అది, ఇకపై చెల్లదు' అని నన్ను రెచ్చగొట్టేది. నేను ఇక్కడ ఈ ఉద్యోగం మానేసి వేరేచోట ఏదైనా ఉద్యోగం చూసుకుంటే తంగం నాతో వచ్చే ఆశకూడా నాలో క్రమంగా హరించుకొనిపోయింది.

అయితే అమ్మకు ఇవేవీ తెలిసేవి కావు. ఏడాది వచ్చినప్పటి నుంచీ స్వర్ణ బొమ్మ మెడలో లింగకాయ అయిపోయింది. ఆవిడ దగ్గరే నిద్రపోతుంది. పొద్దస్తమానం ఆవిడ వొళ్ళోనే ఉంటుంది ఆ పిల్ల అంటే ఇంతా అంతా ప్రేమకాదు ఆ బొమ్మకి. స్వర్ణకుట్టికి మూడేళ్ళు వచ్చాయి. బొమ్మే బడికి తీసుకొనిపోవాలి. బొమ్మే మళ్ళీ వచ్చి ఎత్తుకొని తనను తీసుకొని రావాలి. వాళ్ళిద్దరి భాష వాళ్ళకు మాత్రమే తెలుసు. ఇక నాకు ఇంట్లో ఉన్నంతసేపు స్వర్ణతోనే కాలక్షేపం. నాకు ఇక ఏ వినోదాలూ లేవు. ఎక్కడకూ వెళ్ళేవాణ్ణి కాను. ఒకే ఆఫీసులో పని చేయడం బాగుండదని తంగం వాళ్ళ నాన్న పరువు ప్రతిష్ఠా, పలుకుబడీ, అధికారదర్పం ఉపయోగించుకొని తంగం వేరే బ్రాంచికి మార్పించుకుంది.

తంగంతో నాకేమిటి? నా చిన్నారి చిట్టితల్లి స్వర్ణ ఉందికదా నాకు? నాతల్లి అనికాదు కాని, అంత చిన్నప్పుడే నా బంగారు తల్లి గ్రహింపు, ప్రేమాభిమానాలు, మాలిమి నాకెంతో ఓదార్పు కలిగించేవి.

నేను వొట్టి దురదృష్టవంతుణ్ణి. మా ఆవిడతో నాకెటువంటి సుఖమూ లేకుండా పోయింది. పైగా, చీటికి మాటికి సిగపట్లు. నిన్ను చేసుకోవడం నా తలరాత అని స్పష్టంగా చెప్పేసింది. దేశం, సమాజం ముఖ్యం. త్యాగం, ధైర్యం, విప్లవం ముందు కుటుంబం, తల్లీతండ్రీ, అప్పో ఆయనా ముఖ్యంకాదు అని చెప్పేసింది.

మరి నాకీ విషయాలు ముందు చెప్పాల్సి ఉండెను కదా అంటే 'నీవు నీ విషయాలు చెప్పావా? మీ అమ్మ వంటమనిషి అని ఎందుకు చెప్పలేదు?'అని అసహ్యంగా ఎత్తి పొడిచింది. 'దేవతలు భయపడేచోట మూర్ఖులు ముందుకురుకుతారు - అని వినలేదా. నన్ను ఎలా పెళ్ళాడ

దామా అన్న ఆత్రమే సరిపోయె నీకు. ఇక నేను నా అభిప్రాయాలు చెప్పే అవకాశం ఎక్కడిచ్చావు?' అన్నది.

రాజా రవివర్మ రోడ్డులోని బాంకు బ్రాంచి దోపిడీ ప్రయత్నం జరిగింది. వాచ్‌మన్ చనిపోయాడు. డబ్బు పోలేదు. ఈ విషయం వినగానే నా రక్తం గడ్డకట్టుకొనిపోయింది. నా చిన్నతల్లి స్వర్ణకుట్టిని, మా అమ్మని తీసుకొని ఎవరికీ తెలియనిచోటికి రహస్యంగా పారిపోదామనిపించింది. 'నన్ను అరెస్టు చేయవచ్చు. మీరేం కలిగించుకోవద్దు' అని తంగంచెప్పింది. తంగం వాళ్ళ నాన్న పలుకుబడి వల్ల అంత దూరం పోలేదు. కానీ, ఆవిడ ఉద్యోగం పోయింది. ఇక నా సంసారం కుదుట పడుతుందని నేను నిబ్బరంగా నిట్టూర్చాను. ఎంతో ప్రేమాభిమానాలతో, సేవాభావంతో తంగంను ఆదరించాను. కానీ, తంగం నాతో ఉండడానికి ఇష్టపడలేదు- పుట్టింటికి వెళ్ళిపోయింది. నేను నా స్వర్ణకుట్టిని ఒక్కరోజైనా చూడకుండా బతకగలనా? మా అమ్మ ఏడుపు నా నవనాడులను ఎవరో ఛిద్రం చేస్తున్నట్లనిపించేది. ఆమె పచ్చి మంచి నీళ్ళు కూడా ముట్టలేదు. కంటికి ఏకధారగా ఏడుస్తూ కూచునేది. నాకు బంధువులు, సహాయం చేసేవాళ్లు, సానుభూతి చూపేవాళ్లు ఎవరూ లేరు. ఏం చేయాలిప్పుడు? తంగం తాను ఒక్కతీ పోతే నాకేం బాధ కలిగి ఉండకపోను. నా సర్వస్వాన్నీ, నా ప్రాణానికి ప్రాణాన్ని, మా అమ్మ ఊపిరిని తనతో తీసుకొని వెళ్ళిపోయింది.

కోర్టులో నేను కేసు పెట్టాను. తంగం నడవడి మంచిది కాదు. ఆవిడకు ఇదివరలోనే స్నేహితు లున్నారు. అదీకాక ఆమె చట్టానికి వ్యతిరేకమైన రహస్య కార్యకలాపాలతో సంబంధం వున్న వాళ్ళతో భావసామ్యం కలిగి ఉన్నది. నేను పెద్ద ఆఫీసరును. ఎంతో ఘనమైన విద్యాయోగ్యతలున్నవాణ్ణి. గొప్ప భవిష్యత్తు పైన ఆశ వున్నవాణ్ణి. ఉద్యోగంలో చాలా పైకి రావలసినవాణ్ణి. నాకు సర్వస్వమూ నా పాపే.

నాకు వృద్ధురాలైన తల్లి కన్నా వేరే ఆధారంలేదు. ఆ పాపను విడిచి ఆమె క్షణకాలం కూడా బతకలేదు. కాబట్టి నా స్వర్ణను నా అధీనం చేయండి. ఆమె - అంటే తంగం నాతో కాపరం చేయడానికి ఇష్టపడక పోయినా నాకు చింతలేదు. స్వర్ణ భవిష్యత్తు అశాంతి జనకం కాకుండా నా బతుకు నిష్ప్రయోజనమూ, పనికిమాలిందీ కాకుండా నా స్వర్ణను నాకు ఇప్పించండి అని చాలా డబ్బు ఖర్చుపెట్టి లాయరుద్వారా కోర్టు వారికి మొరపెట్టుకున్నాను. తంగం నాపై విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసింది. మూడేళ్లు కోర్టు చుట్టూ ఆశతో ఆత్రంగా ప్రాణాలుగ్గ బట్టుకుని తిరిగాను. మా అమ్మ ప్రాణంలేని కట్టె అయిపోయింది. సగా నికి సగం అయిపోయింది.

చిన్నపాపను తల్లి నుంచి విడదీయకూడదని కోర్టు తీర్పు. విచా రణకాలంలో మా అమ్మ వాళ్ళింటికి వెళ్ళి పాపను చూచి వచ్చి నాకు చెపుతూండేది. ఆమె ప్రాణాలు నిలచివుండడానికి అదే కారణం. నాక దొక్కటే ఓదార్పు.

ఆ తీర్పు వచ్చిన రోజున మా అమ్మ దుఃఖం ఏమని చెప్పను? రైల్వేస్టేషన్‌లో ఆమె ఏడ్చిన ఏడ్పు చూడటానికోసమేనా నేనిన్నాళ్లూ బతికి ఉన్నది అని నా నరనరం ఎవరో పిండి పిప్పి చేసినట్లయింది.

ఇంతటితో ఈ విషాదం ముగియలేదు. తంగం వాళ్ల మేనమామ అమెరికాలో ఉన్నాట్ట. పైచదువులు చదువుతానంటూ అమెరికా వెళ్ళి పోయింది. కుంజన్ నంబియార్‌గారింట్లోనే స్వర్ణకుట్టి మిగిలిపోయింది. నేను వెళ్ళి కాళ్ళావేళ్ళాపడ్డాను. ఎంతో ప్రాధేయపడ్డాను. కాని, ఆయన మనసు కరగలేదు. తమ కష్టాలన్నిటికి నేనే కారణమని నాపై కక్ష కట్టిన ఆయన మనసు ఎందుకు కరుగుతుంది?

నేను తంగంను కలిసి కాళ్ళావేళ్ళాపడ్డాను. ఇక ఏమీ కోరను, ఈ ఒక్క సహాయం చేయాల్సిందనీ నా బతుకు నిలపాల్సిందనీ బతిమాలాను. కాని, తంగం ససేమిరా వొప్పుకొలేదు.

'ఈసారి వచ్చినప్పుడు స్వర్ణను నాతోనే అమెరికా తీసుకుని వెళతాను. నీకిస్తే ఈ జన్మలో మళ్ళీ దాన్ని నేను పొందగలనా?' అంది తంగం. నీకంటే నాకే దాని అక్కర ఎక్కువ అని చేతులు పట్టుకొని ఒతిమాలాను. కాని, తంగం మెత్తపడలేదు.

ఇదీ నా కథ మా అమ్మ నా దగ్గర ఉండలేదు. మా బావకు నాపై గొంతువరకూ కోపం. మా అక్కకి అసహ్యం. నెలకో ఉత్తరం రాస్తాడు మా బావ - మీ అమ్మను వెంటనే తీసుకొని ఏ గంగలో దిగుతావో వెంటనే దిగు అని. నేను డబ్బు పంపించినా వాళ్లకు ఇష్టం ఉండదు. నామీద ఏ కోశానా సానుభూతీ ఆదరమూ లేవు.

మా ఆవిడ పేరు తంగమణి.

నా కిప్పటికీ ఒక అత్యాశ. తంగంకోసం కాకపోయినా స్వర్ణ కోసం-ఆవిడ ఇవాళ కాకపోయినా, రేపైనా, ఇంకా చాలా కాలం తర్వాతైనా వొప్పుకుంటే ఆమెతో కలిసి కాపరం చేదామనే. అయితే ఈలోపున స్వర్ణకు నేను దూరమైపోతాను. అయినా, నా స్వర్ణ నాకు కావాలి. నన్ను నాన్నా అని పిలవాలి. ఇప్పుడు నా బంగారు తల్లి అమ్మకీ నాన్నకి కూడా కాక హాస్టల్లో ఆయాల సంరక్షణలో ఆడుతోందా-పాడుతోందా - బువ్వ తింటోందా - కళ్లమీద రెప్పలు బరువుగా వాలితే ఆ చిన్నారి నిద్రలో ఎవరిని తలచుకుంటోందో!

మణి మణి మణి అని మీరు పదే పదే చిట్టితల్లిని ముద్దాడుతుంటే నా చిట్టి నా కళ్లలో దిగులుగా దీనంగా కనిపించి నేను తట్టుకోలేకపోయాను.

ఇప్పుడు నేనెలాగూ నా గదికి వెళ్ళలేను. వెళ్ళినా భరించలేను. ఇక్కడే ఎలాగో గడుపుతాను. అదేమిటో నా జీవితంలో ఎప్పుడూ ఒక్కలాగే జరుగుతున్నది. ఒక గంటసేపు మీతో ఉండి వెళదామను కున్నవాణ్ణి ఇప్పుడు పన్నెండు కావస్తోంది. పాపను తీసుకోండి" అన్నాడు సీతారామశాస్త్రి-తడిఆరిపోయిన కళ్లలో మళ్ళీ ఏడుపును అప్ప ళించుకొనే ప్రయత్నం చేస్తూ.

రాజ్యం చిట్టిని చేతుల్లోకి తీసుకుంటుంటే 'నాన్న, నాన్న, నాన్న' అని కలవరిస్తోంది మణి. (ఇండియా టుడే - 1990)